నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 28 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మిఠాయి తినిపిస్తున్న నాయకులు

న్యాయమే గెలిచింది

- బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్రలు పటాపంచలయ్యాయి
- ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ శ్రేణుల హర్షం
- మిఠాయిలు పంచి.. పటాకులు కాల్చి సంబురాలు

మంచిర్యాలటౌన్, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు కావడంపై బీఆర్ఎస్ సంబురాలు జరుపుకున్నది. మంగళవారం సాయంత్రం మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్రలో భాగంగానే కవితను అరెస్టు చేశారని, ఆమెకు బెయిల్ రాకుండా అనేక శక్తులు అడ్డుపడ్డాయని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన కూతురు అరెస్టు విషయంపై ఏనాడూ మాట్లాడలేదని, న్యాయం మనవైపే ఉందని చెప్పారని అన్నారు. కవితకు బెయిల్ మంజూరైతే బీజేపీ ఎంపీ, మంత్రి సుప్రీం తీర్పును కూడా తప్పు పట్టారంటే వారికి ఎంత ద్వేషముందో అర్థమవుతుందని తెలిపారు. కవితకు బెయిల్ మంజూరు కావడం హర్షించదగ్గ విషయమని, దీనిని బట్టి చూస్తే ఏనాటికైనా న్యాయమే గెలుస్తుందని అర్థమైందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, గోగుల రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు గట్టయ్య, సుధీర్, తాజుద్దీన్, శ్రీరాముల మల్లేశ్, కర్రు శంకర్, జెట్టి చరణ్, పల్లపు రాజు, పల్ల రాజన్న, రాజు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, ఆగస్టు 27 : పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి.. మిఠాయిలు తినిపించుకుంటూ సంబురాలు చేసుకున్నారు. చివరకు న్యాయమే గెలిచిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, సుదర్శన్, మానిక్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు ఎవరికోసమో?!

ఎన్‌హెచ్-63 మూడో అలైన్‌మెంట్‌పై భగ్గుమన్న రైతులు

- సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా ఎల్లంపల్లి నిర్వాసితుల భూముల సేకరణ
- లక్షెట్టిపేటలోని ఓ విద్యాసంస్థ కోసమేనంటూ ఆరోపణలు
- బడా వ్యక్తులు, రియల్ వ్యాపారుల హస్తముందంటూ చర్చలు
- న్యాయం కోసం బాధితుల వేడుకోలు
- మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో నోటీసులు తగలబెట్టి నిరసన

మంచిర్యాల ఆర్డీవో కార్యాలయం ముందు అధికారులిచ్చిన నోటీసులను తగలబెడుతున్న రైతులు


ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మంచిర్యాల, ఆగస్టు27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా కుర్మపల్లి వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్-63 అలైన్‌మెంట్ మూడోసారి కూడా మారింది. ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు.. తాజాగా భూములు కోల్పోయే రైతులకు సైతం నోటీసులివ్వడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఎన్‌హెచ్-63 అలైన్‌మెంట్ ఎవరికోసం మార్చారంటూ అన్నదాతలు మండిపడుతున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయామని, ఉన్న కొద్దిపాటి భూమి కూడా హైవేలో పోతే ఇక బతికేదెట్లా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్ఏఐ చట్టప్రకారం నడుచుకోకుండా, హడావుడిగా నోటీసులిచ్చి భూములు లాగేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అలైన్‌మెంట్‌ను రద్దు చేసి, రైతులకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి వచ్చి అధికారులిచ్చిన నోటీసులను తగలబెట్టి నిరసన తెలిపారు. ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో ఏవోకు వినతిపత్రం సమర్పించారు. అసలు హైవే కోసం మూడు సార్లు అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని.. రెండో అలైన్‌మెంట్ బాగుందని నిపుణులు చెప్పినా... మూడోసారి ఎవరికోసం మార్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బ్రౌన్ ఫీల్డే బాగుండేనా.. తప్పుడు రిపోర్ట్ ఇచ్చారా..

నేషనల్ హైవే-63 నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ దాకా విస్తరించి ఉంది. ఈ హైవేను ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు ఫోర్‌లేన్‌గా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రూ.5354.12 కోట్ల అంచనాతో 160 కిలోమీటర్ల పొడవునా పొలాల మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి మొదటి అలైన్‌మెంట్ రూపొందించారు. లక్షెట్టిపేట శివారులోని పొలాలు, అటవీ ప్రాంతం మీదుగా ఇది వెళ్తుంది. దీనికి స్థానిక రైతులు అంగీకారం తెలపకపోవడం కొంత మంది భూస్వాములు, రియల్టర్లు ఫైరవీలు చేసి ఒత్తిడి తీసుకురావడంతో దాన్ని రద్దు చేశారనే ఆరోపణలున్నాయి. ఇక రెండోసారి ప్రస్తుతమున్న రోడ్డునే బ్రౌన్‌ఫీల్డ్‌గా మార్చడానికి అలైన్‌మెంట్ తయారు చేసి 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. రోడ్డుపక్కన ఉన్న ఇండ్లు, భూములు కోల్పోతున్న వారు వ్యతిరేకించినా సర్వే చేశారు. దీంతో చాలా మంది హైవే తప్పదని నిర్ణయానికి వచ్చి రోడ్డు పక్కన భూముల్లో కొత్త షెడ్లు వేసుకొని, బోర్లు నిర్మించుకున్నారు. నిర్మాణాలుంటే ఎక్కువ పరిహారం వస్తుందని భావించారు. నిపుణులు సైతం బ్రౌన్ ఫీల్డ్ చేస్తే తక్కువ నష్టం ఉంటుందని చెప్పారు. కానీ లక్షెట్టిపేటలోని కొందరు భూములు, ఇండ్లు కాపాడుకోవడం కోసం నానా యాగీ చేశారు. ఫోర్‌లేన్ కోసం 150 ఫీట్లు(45 మీటర్లు) అవసరం, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని రోడ్డు 132 ఫీట్లు (40 మీటర్ల) వెడల్పు ఉంది. మరో ఐదు మీటర్లు పెంచుకుంటే అయిపోయేదానికి ప్రస్తుతమున్న రోడ్డు 100 మీటర్లే ఉందంటూ తప్పుడు రిపోర్టు ఇచ్చారు. ఫోర్‌లేన్ కోసం భారీగా భూ సేకరణ చేయాల్సి వస్తుందని తప్పుడు రిపోర్ట్ ఇచ్చి అధికారులను బోల్తా కొట్టించారు. ఎవరికీ నష్టం కలగకుండా లక్షెట్టిపేట శివారు నుంచి బైపాస్ తీయాలని మున్సిపల్‌లో తీర్మానం చేశారు.

ఓ విద్యాసంస్థకు అనుకూలంగా మూడో అలైన్‌మెంట్..!

రెండు అలైన్‌మెంట్ల అనంతరం ఎన్‌హెచ్ఏఐ అధికారులు లక్షెట్టిపేట మండలం మోదెల నుంచి కుర్మపల్లికి మూడో అలైన్‌మెంట్ రూపొందించారు. గోదావరి తీరం వెంట 35 కిలోమీటర్లు నిర్మించే ఈ రోడ్డు కోసం జిల్లాలోని 17 గ్రామాల్లో 1433.75 ఎకరాల భూ సేకరణకు సిద్ధమయ్యారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం నుంచి గోదావరి మీదుగా లక్షెట్టిపేట శివారుగా ముల్కల్ల దాకా మూడో అలైన్‌మెంట్ సిద్ధం చేశారు. రెండు అలైన్‌మెంట్ బ్రౌన్‌ఫీల్డ్ రద్దు కావడం, లక్షెట్టిపేట మోదెల శివారు నుంచి బైపాస్ తీయాలని మున్సిపల్ తీర్మానం చేయడం.. లక్షెట్టిపేట సమీపంలో భూములు కొనుగోలు చేసిన ఓ మైనార్టీ విద్యాసంస్థకు ఇష్టం లేదని తెలిసింది. దీంతో వాళ్లు ఢిల్లీ స్థాయిలో ఫైరవీలు చేయడంతో బైపాస్ మీదుగా వెళ్లాల్సిన హైవే కాస్తా పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్‌గా మారినట్లు తెలిసింది. దీనికి ఈ ప్రాంతంలో ఉండే బడా భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వంత పాడడంతో సీన్ పూర్తిగా రైతుల పీకలమీదికి వచ్చేసింది. ఈ విద్యాసంస్థ సంస్థకు సన్నిహితంగా ఉండే ఎన్‌హెచ్ఏఐ హైదరాబాద్ రీజినల్ ఆఫీసులో పని చేసే ఓ అధికారి సహకరించినట్లు తెలుస్తుంది. ఆయన ఢిల్లీకి బదిలీ కావడంతో పని మరింత సులభమైనట్లు సమాచారం.

సుప్రీం మార్గదర్శకాలను తొక్కేశారు.. కోర్టుకు వెళ్తే బ్రేకులు తప్పవు..

హైవేలు, ప్రాజెక్టుల కోసం ఓ సారి భూములు కోల్పోయిన వారి నుంచి రెండోసారి భూ సేకరణ చేయడానికి వీల్లేదు. ఈ మేరకు సుప్రీం కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ మూడో అలైన్‌మెంట్ విషయంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు దీనిని పరిగణలోకి తీసుకోలేదు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల్లో వేల ఎకరాల సాగు భూములు తీసుకున్నారు. దాదాపు 9 గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా మారారు. వారికి వేరే దగ్గర భూములు, ఇండ్లు పరిహారంగా అందజేశారు. ఇప్పుడు మూడో అలైన్‌మెంట్‌లో మళ్లీ అదే గ్రామాల రైతులు భూములు కోల్పోతున్నారు. 2004లో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భూములు ఇచ్చామని, ఇప్పుడు మిగిలిన కొద్దిపాటి భూమిని నేషనల్ హైవేకు ఇస్తే తాము రోడ్డు మీదకు రావాల్సిందేనంటూ వాపోతున్నారు. అధికారులు అలైన్‌మెంట్ మార్చకపోతే కోర్టుకు వెళ్లి తేల్చుకుంటామని చెబుతున్నారు. బ్రౌన్ ఫీల్డ్‌తో ఎవరికి ఇబ్బంది లేదని, కొందరి కోసం రైతులను ఇబ్బందులు పెట్టొద్దని వేడుకుంటున్నారు.

ఉన్న ఎకరం కూడా కావాలంటూ నోటీసులిచ్చిన్రు

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కోసం 2004లో మా భూమి తీసుకున్నరు. అది పోంగ ఎకరం మిగిలింది. దానిమీదే నేను, నా కొడుకు బతుకుతున్నం. ఇప్పుడు హైవే కోసం ఆ భూమి క ఊడా కావాలంటూ నోటీసులిచ్చిన్రు. ఉన్న ఎకరంపోతే నేను, నా కొడుకు బతికేదెట్లా. ఇదెక్కడి న్యాయం. నా పాణం పోయినా మంచిదే భూమి ఇచ్చేది లేదు.

- చల్ల సత్తవా, సూరారం

పోయిన భూమికే రూపాయి రాలే

మాకు ముల్కలలో భూమి ఉంది. మంచిర్యాల పంప్ హౌస్ కోసం గతంలో 17 గుంట ల భూమిని తీసుకున్నరు. గా భూమికి ఇప్పటి దాకా ఒక్క రూపాయి కూడా ఇయ్యలే. ఇప్పుడు మిగిలిన ఎకరం భూమి మధ్యలో నుంచి హైవే వేస్తున్నారు. ఎంతో విలువ చేసే భూమి పోతుందంటే బాధేస్తుంది. న్యాయం జరిగే దాకా పోరాటం చేస్తా. మా కుటుంబాన్ని రోడ్డు పాలు చేయొద్దు.

- అల్లి లక్ష్మి, వేంపల్లి

చింతలమాదర (మందగూడ)లోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల

పై చిత్రంలో ఉన్నది తిర్యాణి మండలం చింతలమాదర (మందగూడ)లోని ఐటీడీఏ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల. ఇందులో దాదాపు 22 మంది ఆదివాసీ బిడ్డలు చదువుకుంటున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులుండగా, ఇటీవల ఒకరు ఉద్యోగ విరమణ పొందారు. మరొకరు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ పాఠాలు బోధించేవారే కరువయ్యారు. నిన్నమొన్నటి దాకా చింతలమాదరతో పాటు చుట్టు పక్క పల్లెల నుంచి విద్యార్థులు పాఠశాలకు రావడం.. ఉపాధ్యాయులు లేక తిరిగి వెళ్లడం జరిగింది. ఈ నేపథ్యంలో విద్యకు దూరమవుతున్న పిల్లల పరిస్థితి, తల్లిదండ్రుల ఆవేదనను చూసి ఇదే గ్రామంలో పనిచేసే అంగన్‌వాడీ టీచర్ తురంం కవిత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠాలు బోధిస్తున్నారు. ఇలా ఈ ఒక్క పాఠశాల అనే కాదు.. జిల్లా వ్యాప్తంగా అనేక స్కూళ్లలో టీచర్లు లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు.

'గిరి' విద్యపై నిర్లక్ష్యమెందుకు?

ఉపాధ్యాయులు లేక మూసివేసే దిశగా పాఠశాలలు

- జిల్లా వ్యాప్తంగా 38 బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరో
- చింతలమాదరలో ఒకరు ఉద్యోగ విరమణ, మరొకరు బదిలీ
- స్వచ్ఛందంగా ముందుకొచ్చి పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్
- అడవిబిడ్డల భవిష్యత్ ప్రశ్నార్థకం

చింతలమాదర పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్ కవిత

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/తిర్యాణి, ఆగస్టు 27 : ఆసిఫాబాద్ జిల్లాలో 330 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలుండగా, వీటిలో 38 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య'జీరో'ఉండడం విశేషం. ఆసిఫాబాద్ మండలంలో 6, వాంకిడి మండలంలో 9, తిర్యాణిలో 12, బెజ్జూర్‌లో 4, చింతలమానేపల్లిలో 2, సిర్పూర్-యూలో 2, జైనూర్‌లో 2, సిర్పూర్-టీలో ఒక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య జీరోగా ఉంది. గతంలో ఈ పాఠశాల్లో గిరిజన విద్యార్థులు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం గమనార్హం. విద్యార్థులు లేరనే సాగుతో ఈ పాఠశాలలను మూత వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అడవిబిడ్డల భవిష్యత్ ప్రశ్నార్థకం

ఐటీడీఏ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక అడవిబిడ్డల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి మెరుగైన విద్యనందించేందుకు చర్యలు చేపట్టగా, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం పాఠశాలలు మూతబడే స్థితికి చేరుకుంటున్నాయి. మరోవైపు కనీస సౌకర్యాలు లేక ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తున్నది.

వారం రోజులుగా తెరచుకోని పాఠశాలలు

కౌటాల, ఆగస్టు 27 : మండలంలోని పలు గిరిజన పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వారం రోజులుగా తెరుచుకోవడం లేదు. కేబీ కాలనీ మొగడ్ధగడ్, శివలింగపూర్, కనికి, జనగాం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఇటీవల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. అలాగే గురుడుపేట గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మెడికల్ లీవ్‌లో ఉండడంతో మొత్తం 5 గిరిజన పాఠశాలలు మూతపడ్డాయి. ప్రతి రోజూ విద్యార్థులు పాఠశాలకు వస్తూ.. ఉపాధ్యాయులు లేక తిరిగి వెళ్తున్నారు. ఈ విషయమై ఎస్సీఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్) మడావి పోచానిని వివరణ కోరగా, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో పాఠశాలలు నడవడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఏజెన్సీలో బంద్ విజయవంతం

నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 27 : ఆదివాసుల కోసం ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ వేయాలని, ఐటీడీఏలో బ్యాగ్‌లాక్ పోస్టులను భర్తీ చేయాలని, జీవో నంబర్ 3ని కొనసాగించాలని, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, తదితర డిమాండ్లతో ఆదివాసీ సంఘం తుడుం దెబ్బ, తదితర ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాపారులు దుకాణాలు మూసి వేసి బంద్‌కు సహకరించారు. పలుచోట్ల రాస్తారోకోలు చేపట్టారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

దేశంలోనే అత్యుత్తమ ప్లాంట్ ఎస్టీపీపీ

మినిస్ట్రీ ఆఫ్ కోల్ సెక్రటరీ దర్శన్‌కుమార్

జైపూర్, ఆగస్టు 27 : పెగడపల్లిలోని ఎస్టీపీపీ దేశంలోనే అత్యుత్తమమైనదని మినిస్ట్రీ ఆఫ్ కోల్ సెక్రటరీ దర్శన్‌కుమార్ కొనియాడారు. మంగళవారం స్థానిక విద్యుత్‌కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈడీ రాజశేఖర్, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మొక్కను జ్ఞాపికగా అందించి శాలువాతో సత్కరించారు. మొదట యూనిట్‌లను పరిశీలించగా ఉత్పత్తికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఉత్పత్తిలో కర్బణ ఉదారాలను తగ్గించడం కోసం (ఎఫ్‌జీడీ) ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్‌ను నిర్మిస్తున్నట్లు సెక్రటరీకి అధికారులు వివరించారు. విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్‌లతో పాటు, సోలార్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే రోజులో ఎస్టీపీపీని అన్ని రంగాల్లో ముందుంచాలని అధికారులకు సూచించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, చీఫ్‌ఆఫ్‌హోఅండ్‌ఎం జైన్‌సింగ్, ఏజీఎం ఎఫ్‌జీడీ ఎంవీ రమణ, మేనేజర్ చంద్రమణి, ఎస్‌వోటూ ఈడీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

దర్శన్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఈడీ రాజశేఖర్

సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల డిమాండ్
- మంచిర్యాల డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

మంచిర్యాలటౌన్, ఆగస్టు 27 : దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను దుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు చెల్లిస్తామని ఇలా అనేక హామీలిచ్చి అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, వెల్ఫేర్ కమిటీలను రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని, టీజీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకే ఇవ్వాలని, 2013, 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించాలని, 2021 వేతన సవరణ వెంటనే అమలు చేయాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రతను కల్పించాలని, ఉద్యోగులు, కార్మికులపై పనిభారం తగ్గించాలని, పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మంచిర్యాల డిపో అధ్యక్షుడు శంకర్, ఉద్యోగులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ట్రాన్స్‌కో ఏఈలు

ట్రాన్స్‌కో ఇంజినీర్ల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మంచిర్యాలటౌన్, ఆగస్టు 27 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భోజన విరామ సమయంలో మంచిర్యాలలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఇంజినీర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. టీజీపీఈఏ మంచిర్యాల శాఖ కార్యదర్శి పానుగంటి లక్ష్మణ్ మాట్లాడుతూ ట్రాన్స్‌కోలో ఏఈల నియామక ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, రామగుండం బీ థర్మల్ పవర్ ప్లాంట్‌ను జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని, ట్రాన్స్‌కో ఇంజినీర్లకు ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈఏ మంచిర్యాల శాఖ కోశాధికారి రాజేశ్, ఎన్‌పీడీసీఎల్ ఏడీఈలు జాడి విలాస్, శరత్, ఎంవీ రాజ్‌కుమార్, ఏ రవికుమార్, డీఈ గులాబ్, ఏఈలు శ్రావణ్, సాయికృష్ణ, మనోహర్, సాయికుమార్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679